క్లుప్తంగా

గంగమ్మ తల్లికి మొక్కుబడులు



భక్తులకు ప్రత్యేక దర్శనంలో గంగమ్మ తల్లి

కారంచేడు: తమ ఆపదలను తీర్చే కల్పవల్లిగా, గ్రామ దేవతగాను విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి ఎంతో ప్రీతికరమైన ఆదివారం ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో భక్తులు అమ్మవారికి మొక్కుబడులు తీర్చే క్రమంలో అమ్మవారికి ఇష్టమైన పొంగళ్ళను నైవేద్యంగా సమర్పించారు. వ్యవసాయ పనులు ప్రారంభించే రైతన్నలు, వేసవి సెలవులు ముగించుకొని పాఠశాలలకు, కాలేజీలకు వెళ్ళే విద్యార్థులు, అమ్మవారి ఆశీస్సులతో ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులు తమ మొక్కుబడులు తీర్చుకొనేందుకు ఆలయంలో బారులు తీరారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ గావించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న గ్రంథపాలకుడు

సంతమాగులూరు(అద్దంకి): పుస్తక పఠనంతో విజ్ఞానం కలుగుతుందని గ్రంథపాలకుడు విజయభాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం నాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. పుస్తకాలు ఎలా చదవాలి, ఏయే పుస్తకాలు చదవాలి, గ్రంథాయంలో ఎన్ని రకాల పుస్తకాలుంటాయి. వాటిని ఎలా ఉపయోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ డొనేషన్ డే వేడుకలు



మాట్లాడుతున్న శివరామకృష్ణ

వేటపాలెం: స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ డొనేషన్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వరల్డ్ డొనేషన్ సందర్భంగా ఆర్గాన్ డొనేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నాయినపల్లికి చెందన పల్లపోలు నాగ మనోహర్ లోహియా మరణానంతరం తన ఆర్గాన్స్, రీసెర్చ్ కోసం తన బాడీని డొనేట్ చేసి అంగీకారం తెలిపారు. ఆర్గాన్ డొనేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ గొల్లపూడి సీతారాం, పాస్ట్ ప్రెసిడెంట్ కొత్త శ్రీనివాసరావు, కారంచేటి శివ రామకృష్ణ, వూట్ల వెంకటేశ్వర్లు, పద్మనాభం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న తోటవారిపాలెం పోలేరమ్మ తల్లి

చీరాల టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి తోటవారిపాలెం పోలేరమ్మతల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల పాలిట కొంగుబంగారంగా కొలువుదీరిన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారిని వివిధ రకాల పూలు, నూతన వస్త్రాలతో సుందరంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు చెల్లించుకుని మొక్కుబడులు సమర్పించుకున్నారు. ఆదివారం కావడంతో జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కూలి రాక.. ఆకలి తీరక

- మూడు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు అందని వైనం
- వ్యవసాయ పనుల్లేక, ఉపాధి వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు
- అప్పుల పాలవుతున్న కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

వేటపాలెం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమల్లో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఓ వైపు వ్యవసాయ పనులులేక, మరో వైపు నెలల తరబడి ఉపాధి కూలీల వేతనాలు అందక కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. చేసిన పనులకు నెలల తరబడి వేతనాలు అందక పోవడం కూలీల అవస్థలు పడుతున్నారు. కుటుంబాల్లో తిండికోసం అప్పులు చేయాల్సిన పర్థితి ఏర్పడుతుందని కూలీలు వాపోతున్నారు. వేసవి కాలంలో జూన్ నెల వరకు కూలీలతో కాలువల్లో పూడిక తీత, ముళ్ల పొదల తొలగంపు, మట్టి రోడ్లు, తదితర పనులు చేయించారు. నెల రోజులుగా ఉపాధి పనులు నిలుపుద చేశారు. కూలీలకు వేతనం కింద రూ. 300 వేతనం నిర్ణయించారు. అయితే కూలి పనులు చేసిన వేతనాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. మరో పక్కన ఉపాధి పనులు నిలుపుద చేశారు. చేసిన పనులకు వేతనాలు ఇవ్వలేదు. దీంతో పనులు చేసిన కూలీల జీవనం కష్టంగా మరిందని ఆందోళన చెందుతున్నారు. అప్పులు చేసి కుటుంబాల జీవనం సాగిస్తున్నామని కూలీలు వాపోతున్నారు. కూరగాయలు, నిత్యావసరాలు, తదితర సరుకులను అప్పులు చేసి తెచ్చుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వ్యాపారులు అప్పులు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు వేతనాలు ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు.

మండలం పరిధిలో..

మండలం పరిధిలో తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింది రూ.8,266 మంది జాబ్ కార్డులు పొందారు. వీరిలో కేవలం 5,500 మంది మాత్రమే యాక్టివ్‌గా కూలి పనులకు తరచూ వెతుంటారు. ఒక్కొక్క కూలీకి దాదాపు 5 నుంచి 6 వారాలు పాటు పనులు చేసిన వేతనాలు ఇవ్వాల్సి ఉంది. రోజుకు రూ. 300 చొప్పున ఆరు వారాలకు ఒక్కో కూలీకి దాదాపు రూ. 10 వేల నుంచి రూ. 12 వేలు వేతనాల రూపంలో అందించాల్సి ఉంది. వేసవి కాలంలో ఉపాధి పనులు చేసే ప్రాంత వద్ద వసతులు ఉండవు. పనుల వద్ద ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పనులు వద్ద టెంట్లు ఏర్పాటు చేసి నీడ వసతితో పనులు కల్పించాల్సి ఉంటుంది. మంచినీటి సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్, ప్యాకెట్లు, మెడికల్ కిట్లు కూలీలకు అందుబాటులో ఉంచాల్సి ఉంది. కానీ ఇవేమి నిర్వహించిన దాఖలాలు లేవు. అయినప్పటికీ కూలీల తాము సొంతంగా బాటిల్స్‌తో తాగు నిటిని తీసుకెళ్లి మండుటెండలో ఉపాధి పనులు చేశారు. ఉండటానికి నీడలేక పోయిన సరిపుచ్చుకున్నారు. అయితే సిబ్బంది కూలీలకు అన్ని వసతులు కల్పించినట్లు రికార్డుల్లో నమోదు చేసుకుటున్నారు. ఉన్నతాధి కారులకు నివేదికలు పంపించారు. కానీ చేసిన పనులకు మూడు నెలలుగా వేతనాల ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడు నెలలుగా వేతనాలు రాలేదు.



మూడు నెలలుగా ఉపాధి వేతనాలు రాలేదు. పూడికతీ, ఫాంపాండ్స్ తవ్వకం వంటి పనులకు వెళ్లాము, నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కూరగాలయలు, నిత్యావస సరుకులు అప్పులు చేసి కడుపు నింపుకోవాల్సి వస్తోంది. అధికారులు త్వరితగతిన బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలి.

– సరళ, ఉపాధి కూలీ, వేటపాలెం

డబ్బులివ్వకుంటే పూట గడిచేదెలా



ఇంకా వ్యవసాయ పనులు ప్రారంభం కాలేదు. రెక్కలు ముక్కలు చేసి పనులు చేశాం. ఇప్పటి వరకు కూలీ డబ్బులు రాలేదు. డబ్బులు లేక పూట గడటం కష్టంగా ఉంది. చేసిన పనుకలు వెంటనే డబ్బులు ఇచ్చే ఏర్పాటు చేయాలి.

– మార్తమ్మ, ఉపాధి కూలీ, వేటపాలెం

నేడు పంచాయతీ కార్యదర్శుల సమావేశం

చీరాల టౌన్: మండలంలోని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లతో సోమవారం సమావేశాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పి.శివన్నారాయణ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి హాజరయ్యే పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల అడ్మిన్లు విధిగా పంచాయతీ, సచివాలయాల సమాచారం, అభివృద్ధి పనుల వివరాలతో విధిగా హాజరుకావాలని సూచించారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని విచారణ వివరాలు, నీటి తీరువా వసూళ్లు, రెవెన్యూ సమస్యల పరిష్కారంపై నిర్వహిస్తున్న సమావేశానికి రెవెన్యూ సిబ్బంది విధిగా హాజరుకావాలని తహసీల్దార్ గోపీకృష్ణ సూచించారు.

జర్నలిస్ట్ మురళి కుటుంబానికి పరామర్శ



మురళి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కరణం వెంకటేష్

చీరాల అర్బన్: సాక్షి దినపత్రిక చీరాల ఆర్సీ ఇన్‌చార్జి కడియం మురళి ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆదివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్నేహశీలి, మృదుస్వభావి, పత్రికా రంగానికి విశేష సేవలందించిన ఆయన మరణం తీరని లోటన్నారు. మంచి వ్యక్తిత్వం గల వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని తెలిపారు. ఆయన కుటుంబానికి తామెప్పుడు అండగా ఉంటామన్నారు. వార్డు కౌన్సిలర్ కీర్తి వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ నాయకులున్నారు.

ప్రకాశం పంతులు స్ఫూర్తి ప్రదాత



మాట్లాడుతున్న ప్రకాశం పంతులు మునిమనుమరాలు

అద్దంకి: విద్యార్థులంతా ప్రకాశం పంతులు స్ఫూర్తితో చదవాలని ప్రకాశం పంతులు మునిమనుమరాలు కేవీఎల్ సుభాషిణి అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతుల జయంతిని పురస్కరించుకుని ఆదివారం ప్రకాశం మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం సభ నిర్వహించారు. ప్రకాశం పంతులు మునిమనుమరాలు కేవీయల్ సుభాషిణి ప్రకాశం కాంస్య విగ్రహానికి పూలమాల వేశారు. తదనంతరం వాసవీ కల్యాణ మండపంలోని వీఎస్ఎస్ వేదికపైన ఇలపావులూరి శేషతల్పశాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలనను వి. కృష్ణ సుభాన్ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రకాశం మునిమనుమరాలు ప్రకాశం బాలికల, బాలుర ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వయంగా నగదు పురస్కారం చేశారు. ఊటుకూరి ఉమా అన్నపూర్ణ గౌరవ అతిథిగా పాల్గొని విద్యార్థులకు అమూల్యమైన సందేశం ఇచ్చారు. చప్పిడి వీరయ్య దంపతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురకాయపాలెం విద్యార్థులకు, గాడేపల్లి పద్మావతి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కాకానిపాలెం విద్యార్థులకు నగదు పురస్కారం అందించారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న రావూరి రంగయ్య, వి. కృష్ణ సుభాన్, కేవీ మారుతీరావు అద్దంకి మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో మొదటి నలభై స్థానాల్లో నిలచిన విద్యార్థులకు నగదు పురస్కారాలకు ఆర్థిక సత్కారాలు చేశారు. వూటుకూరి రామ కోటేశ్వరరావు, సంకా సుబ్రహ్మణ్యం, గాడేపల్లి దివాకరదత్, ఇలపావులూరి శేషతల్పశాయి, షేక్ మహమ్మద్ రఫీల సౌజన్యంతో మండలంలోని 210 మంది ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డీవీఎం సత్యనారాయణ ప్రకాశం పంతులుగారి జీవిత విశేషాలను ఉటంకిస్తూ లఘు ప్రసంగాలు చేశారు. సభ ప్రారంభంలో ప్రకాశం మిత్ర మండలి నిర్వహించిన క్విజ్ పోటీలో పదిమంది విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. సభకు అద్దంకి పురప్రముఖులు వి.రఘురామశర్మ, పసుమర్తి కోటయ్య, చుండూరి మురళీ సుధాకర్ దంపతులు, యనమండ్ర వరలక్ష్మి, పాలపర్తి జ్యోతిష్మతి, శ్రీమతి కొల్లా భువనేశ్వరి, మలాది శ్రీనివాస రావు, పంచాగ్నుల ఉదయభాస్కర్, అనంతు నాగేశ్వరరావు, పీఎల్‌వీ నరసింహారావు, లక్కరాజు శ్రీనివాసరావు, ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం ఉల్లాసంగా.. ఉత్సాహంగా!



వాడరేవు తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

చీరాల టౌన్: మండల పరిధిలోని వాడరేవు సముద్ర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. వివిధ గ్రామాల ప్రజలు తమ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపేందుకు వాడరేవు తీరానికి చేరుకున్నారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా కేరింతలు కొడుతూ సముద్రంలో స్నానమాచరించి ఆనందోత్సాహాలతో సందడి చేశారు. తీరం ఒడ్డున యువకులు సేదతీరుతూ సముద్రపు మన్నుతో ఆటలాడుతూ కడలి చెంత సంతోషంగా గడిపారు. చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలతో పాటు పల్నాడు జిల్లా, గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ కుటుంబ సభ్యులతో వాడరేవు చేరుకుని స్నానాలు ఆచరించి తీరంలో సరదాగా గడిపారు. దీంతో వాడరేవులో కోలాహలం నెలకొంది.

డీఎస్సీలో ర్యాంకుల పంట

మార్టూరు: రాష్ట్ర వ్యాప్తంగా శనివారం విడుదలైన డీఎస్సీ అభ్యర్థుల పరీక్ష ఫలితాల్లో మార్టూరు మండలానికి చెందిన 8 మంది అభ్యర్థుల సత్తా చాటారు. వారిలో నలుగురు ఎస్టీ కేటగిరీకి చెందిన అభ్యర్థులైనప్పటికీ జనరల్ కేటగిరీలో ర్యాంకులు సాధించారు. అయితే వారిలో ఇద్దరు అభ్యర్థులు రెండు ఉద్యోగాలు కైవసం చేసుకోవడం మరింత విశేషం. మండలంలోని నాగరాజుపల్లి తండాకు చెందిన ఐదుగురు అభ్యర్థులు డీఎస్సీలో విజేతలు కాగా ఇదే మండలం కోలలపూడి గ్రామానికి చెందిన ముగ్గురు అభ్యర్థులు కూడా మంచి ర్యాంకులు సాధించారు. నాగరాజు పల్లి తండాకు చెందిన భూక్యా రవీంద్రానాయక్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 249 ర్యాంకుతో పాటు టీజీటీలో ర్యాంకు సాధించాడు. అదే తండాలోని దేశావత్ ఆంజనేయులు స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 3 వ ర్యాంక్‌తో పాటు టీజీటీలో కూడా ర్యాంక్ సాధించి రెండు ఉద్యోగాలకు అర్హత సాధించాడు. తళావత్ కుమార్ నాయక్ టీజీటీ సోషల్ విభాగంలో 185 వ ర్యాంక్, విజయ్‌కుమార్ నాయక్ ఎస్‌జీటీ ఓపెన్ కేటగిరీలో 6 వ ర్యాంక్ సాధించాడు. కోలల పూడి గ్రామానికి చెందిన అమరేశం శ్రీనివాసరావు బోటనీలో మొదటి ర్యాంకు సాధించాడు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

కారంచేడు: అనారోగ్య కారణాలతో మనస్థాపానికి గురైన వ్యక్తి మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108లో మొదట చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారంచేడు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కుంకలమర్రు గ్రామానికి చెందిన అద్దగడ్డ కోటయ్యకు (48) గత 5 సంవత్సరాల క్రితం పక్షవాతం వచ్చింది. అప్పటి నుంచి ఏపనీ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాడు. మనస్థాపంతో ఉన్న కోటయ్య ఆదివారం గ్రామంలోని పశువుల కొష్టం వద్ద మద్యంలో పురుగుమందు కలుపుకొని సేవించాడు. అది గమనించిన బంధువులు వెంటనే 108లో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అక్కడ రాత్రికి మృతి చెందాడు. మృతుని భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదుతో ఏఎస్ఐ బి. శేషసాయి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్‌కు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

చీరాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రెస్టారెంట్ అండ్ బార్‌ల నిర్వహణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను అనుసరించి ఆదివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఔత్సాహికులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌పై మాట్లాడారు. రియల్ ఎస్టేట్, ట్రాన్స్‌పోర్ట్ యజమానులు, బీడీ కంపెనీ సభ్యులతో, ఆసక్తి ఉన్న వారితో మాట్లాడారు. ఆసక్తి ఉన్న వారు టెండర్లు వేయాలని, లాటరీ పద్ధతిలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. రెస్టారెంట్ అండ్ బార్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

- ఆర్డీవో చంద్రశేఖర్



ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర్

చీరాల రూరల్: రైతులకు అవసరమైన ఎరువులను ఎమ్మార్పీ ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో చంద్రశేఖర్ ఎరువుల దుకాణదారులకు సూచించారు. ఆదివారం తహసీల్దార్ గోపికృష్ణ, వ్యవసాయాధికారి నిర్మలాదేవితో కలిసి పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని ఎరువులను, ఎరువులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎరువుల నిల్వలు ఏ మేర ఉన్నాయని దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులను విక్రయించకుండా నిల్వచేసినట్లు తెలిసినా అధిక ధరలకు విక్రయిస్తున్నారని తెలిసినా అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణదారులు కూడా రైతులకు అవసరమైన మేరకే ఎరువులను విక్రయించాలని సూచించారు. విక్రయించిన ఎరువులకు సంబంధించి ఎప్పటికప్పుడు స్టాక్ రిజిస్టర్‌లో పొందుపరచాలని చెప్పారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంటాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

ప్రజాధనం వృథా



బరదమయంగా తయారైన రన్నింగ్ ట్రాక్



ట్రాక్ మధ్యలో నిలిచిపోయిన వర్షం నీరు

- ఉపయోగపడని రన్నింగ్ ట్రాక్
- రూ. 5 లక్షలతో నిర్మాణం పూర్తి చేసినా దక్కని ఫలితం

చినగంజాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల నిర్మాణం చేసిన రన్నింగ్ ట్రాక్ కొద్దిపాటి వర్షానికి చిత్తడిగా మారుతోంది. గ్రామంలోని క్రీడాకారులతో పాటు పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న క్రీడాకారులకు కూడా ట్రాక్ సౌకర్యవంతంగా లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. క్రీడలకు చిరునామాగా ఉన్న చినగంజాం గ్రామంలో ఎంతో మంది క్రీడాకారులు చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఆట స్థలంలో పలు క్రీడలకు శిక్షణ పొందుతుంటారు. అంతేకాకుండా మార్నింగ్ వాక్ కోసం గ్రామంలోని పలువురు ఈ ఆట స్థలాన్ని వినియోగించుకుంటారు. వారితో పాటు యువ క్రీడాకారులు కొందరు వాలీబాల్, కబడ్డీ వంటి ఇతర క్రీడలకు ఇక్కడే శిక్షణ పొందుతుంటారు. ఈ క్రమంలో ఇటీవల చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రన్నింగ్ ట్రాక్ మంజూరై నిర్మాణం జరగడంతో క్రీడాకారులంతా ఆనందం వ్యక్తం చేశారు. సుమారు రూ. 5 లక్షలతో రన్నింగ్ ట్రాక్ నిర్మాణాని నిర్మాణం చేశారు. ట్రాక్ మధ్యలోని ఖాళీ ప్రాంతంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి కోర్టులు వేశారు. అయితే పనిని ఇంకా పూర్తి చేయలేదు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు నిర్మాణం చేసిన ట్రాక్ కొద్దిపాటు వర్షం పడితే చాలు కనీసం నడిచేందుకు కూడా ఉపయోగం పడటం లేదు. ఆ ప్రాంతమంతా బురద మయంగా మారుతూ క్రీడాకారులకు తీవ్ర అసౌకర్యంగా మారుతోంది. ట్రాక్ నిర్మాణాన్ని అన్ని కాలాల్లో క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. ట్రాక్ నిర్మాణ సమయంలో సాంకేతిక పరమైన అంశాలను పరిగణలోనికి తీసుకోక పోవడంతో సమస్యలు తలెత్తున్నాయని కొందరు సీనియర్ క్రీడాకారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం భాద్రపద మాసం ఉత్తర నక్షత్రం విదియ సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

పద్మాలంకమ్మ అమ్మవారికి పొంగళ్లు



పద్మాలంకమ్మ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పద్మాలంకమ్మ అమ్మవారికి పొంగళ్ళ కార్యక్రమానికి ఆదివారం పొంగళ్ళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముందుగా అమ్మవారికి గ్రామంలోని అర్చకులు కుంకుమలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలు సిద్ధం

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు హరిహర ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకొని మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందించేందుకు సిద్ధం చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఇంకొల్లులోని కృష్ణనగర్, నాగుల చెరువు కట్ట, తటాక అంజనేయ స్వామి దేవాలయం, శివాలయం, రామ మందిరం, చెన్నకేశవ స్వామి దేవాలయం ప్రాంతాల్లో 2 వేల మట్టి విగ్రహాలను సిద్ధం చేసి ఉంచినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. కాలుష్య నివారణకు పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాల ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. ఇందుకు దాతల సహకారం కావాలని నిర్వాహకులు కోరుతున్నారు. భక్తులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హరిహర ధార్మిక సేవా సంస్థ కమిటీ సభ్యులు కోరారు.





పంపిణీకి సిద్ధం చేసి ఉంచిన వినాయక విగ్రహాలు